
# నీళ్ళ ట్యాంకరొచ్చింది- నీళ్ళు పట్టుకోండి!

బసవరాజు ఈజీ ఛైర్‌లో కూర్చుని తీరుబడిగా న్యూస్‌పేపరు చదువుకుంటున్నాడు.

ఇంతలో అతని భార్య రత్నాబాయ్ వచ్చి అతని ముందు డ్యాన్సాడసాగింది. ధన్ ధన్‌మని శబ్దం అవుతుంటే ఏంట్రా నాయనా ఈ శబ్దం అని పేపర్లోంచి తలెత్తి చూసిన బసవరాజు తెగ సంబరపడిపోయాడు.




"హమ్మదొంగా!... నా కెన్నాళ్ళూ చెప్పలేదేం? అయితే నేనాఫీసు కెళ్ళాక డ్యాన్సు నేర్చుకుంటున్నా వన్నమాట?... హబ్బో...హబ్బో...బాగానే చేస్తున్నావే!!" అన్నాడు.

భర్త మాటలు వింటూనే రత్నాబాయ్ ఒంటి కాలిమీద కయ్...మని లేచింది.

"ఏంటే? ...నేను కోపంతో చిందులు వేస్తుంటే మీకు డ్యాన్సాడుతున్నట్టుందా?..." అంది మండిపడ్తూ.

"కోపమా? ... దేనికే?!" అయోమయంగా ప్రశ్నించాడు బసవరాజు.

"అది కూడా నేను చెప్పాలా?... ముందా షర్టు తీసిపారెయ్యండి... లుంగీ

విప్పి పారెయ్యండి... బనీను కూడా తీసిపారెయ్యండి..."
అది వింటూనే బసవరాజు సిగ్గుతో మెలికలు తిరిగిపోయాడు.
"ఛీ... అప్పుడేనా? ...రాత్రికి చూస్కుందాంలే ..." అన్నాడు.
"మీ మొహానికి ఆ సర్దాకూడానూ ... నోర్మూయ్యండి! మిమ్మల్ని బట్టలిప్పమంది అందుక్కాదు."
"మరి? ..." అయోమయంగా అడిగాడు బసవరాజు.
"ఎందుకేమిటే? ...కసరత్తు చేయొద్దూ? .... ఈవేళ నీళ్ళ ట్యాంకరు వచ్చేరోజు! ...."
బసవరాజు నాలుక కొరుక్కున్నాడు.
"అవును కదూ! ... ఆ విషయమే మర్చిపోయా ..." అని బట్టలు విప్పి అవతల పారేసి డ్రాయరుతో బస్కీ దండలు తియ్యడం మొదలు పెట్టాడు.
అప్పుడే వాళ్ళబ్బాయి నాలుగేళ్ళ టింగు ఆ గదిలోకి వచ్చాడు.
"అమ్మా .... నాన్నారు ఇలా బట్టలిప్పి నిల్చుంటే అచ్చు ఎలుగుబంటిలా ఉన్నారు కదే! ... హమ్మో! ... ఒంటినిండా ఎంత బొచ్చో!! ... హిహి..." అన్నాడు సంతోషంతో చప్పట్లు కొడ్తూ. "మొన్నటి వారం స్కూల్లో పిక్నిక్‌కి వెళ్ళినప్పుడు అక్కడ జూలో ఎలుగుబంట్లు అచ్చు నాన్నారిలానే ఉన్నాయ్ ...హిహి..."
"నేను ఎక్సర్ సైజులు చేసేప్పుడు వాణ్ని గదిలోకి రానివ్వొద్దని నీకు చెప్పానా? .... ఇలాగైతే నేను ఎక్సర్ సైజు చేయనంతే! ..." అంటూ అరిచాడు బసవరాజు.
"ఏంటో చిన్నపిల్లాడు అన్న మాటల్ని కూడా పట్టించుకుని గింజుకు పోతారు...ఒరేయ్, నువ్ బయటకెళ్ళు ఆడుకో...." అని టింగుని బయటికి తరిమింది రత్నాబాయ్.
"ఇంక ఎక్సర్‌సైజు చెయ్యడం ఆపెయ్‌నా?" అని అడిగాడు బసవరాజు మెల్లగా మస్కా కొడ్తూ.
"అప్పుడే ఆపేస్తే ఎలా? ... ఇంకాస్సేపు చెయ్యండె ..." గుడ్లురిమి చూసింది రత్నాబాయ్.
బసవరాజు నిట్టూర్చి గుంజీళ్లు తీయటం మొదలు పెట్టాడు. అలా మరో పది నిముషాలు ఎక్సర్‌సైజు చేశాడు.
"ఇహ చాల్లే బట్టలేస్కోండె ... అవతారం చూళ్లేక ఛస్తున్నా ... మళ్లీ నీళ్ల ట్యాంకరు వచ్చి వెళ్ళిపోయినా పోతుంది ..." విసుక్కుంది రత్నాబాయ్.

బసవరాజు బట్టలేస్కున్నాడు. తరువాత రత్నాబాయ్ అతనికి పాలూ, ఉడకబెట్టిన కోడిగుడ్డు ఇచ్చింది.
"ఆ తోపులాటకి తట్టుకుని నీళ్లు తేవాలంటే బలం కావాలి!" అంది.
కోడిగుడ్డు తిని, పాలు తాగాడు బసవరాజు.
ఇంతలో వాళ్ళింటికి అప్పారావని బంధువుహొకాయన వచ్చాడు. అతనికి ఆ ఊళ్ళో కోర్టు పని ఉండి వచ్చాడు.
"రాండ్రాండి అన్నయ్యగారూ!... సరిగ్గా సమయానికి వచ్చారు ..." అంటూ బసవరాజుకి, అప్పారావుకి చెరొక బిందె ఇచ్చింది రత్నాబాయ్.
"ఇదెందుకు?!" ఆశ్చర్యంగా బిందె పుచ్చుకుంటూ అడిగాడు అప్పారావు.
"ఎందుకేమిటి? ... ఇప్పుడు నీళ్ళట్యాంకరు వస్తుంది ... నీళ్ళు తేవడానికి! చుట్టాలొచ్చినా స్నేహితులొచ్చినా ఎవరి నీళ్ళు వాళ్ళు తెచ్చుకోవాల్సిందే! ..."
అప్పారావు బిందె నేలమీద పెట్టి తన బ్రీఫ్ కేసు అందుకున్నాడు.
"మీ ఇంట్లో దిగుతే మీకు చాలా ఇబ్బందిగా ఉంటుంది గానీ ... నేను హోటల్లో దిగుతాను చెల్లమ్మా, హిహి" అన్నాడు నవ్వు తెచ్చిపెట్టుకుంటూ అప్పారావు.
"భలేవారే అన్నయ్యగారూ! ... మీరు సమయానికొచ్చారు ... ఈ టైమప్పుడు వెళ్ళిపోతానంటే ఎలా? ... ఆ! ... హహ.." అని ఆయన చేతిలోంచి బ్రీఫ్‌కేసు లాక్కుని బిందెను పెట్టింది.
అప్పారావు ఆముదం తాగినట్టు మొహం పెట్టాడు.
"ఊ ...ఊ... ఇంక పదండి ..." అని రత్నాబాయ్ ఇద్దర్నీ బయటికి తరిమింది.
బసవరాజు, అప్పారావు బిందెలు పుచ్చుకుని రోడ్డుమీద పడ్డారు. కాస్త దూరం వెళ్ళాక అక్కడ చచ్చేంత జనం ఉన్నారు. ఒకటే సందడిగా ఉంది. ఒక పక్క బొమ్మలూ, బుడగలూ అమ్మే కుర్రాళ్ళున్నారు. ఇంకో పక్కన కాలక్షేపం బఠానీలూ, వేర్సెనక్కాయలూ, ఐస్క్రీములూ, మిరపకాయ బజ్జీలు అమ్మేవాళ్ళున్నారు.
"హ్రే! ...నేను మంచి సమయానికే ఈ ఊరొచ్చాను ...! ఇక్కడేదో జాతర జరుగుతున్నట్టుందే ... ఇక్కడ కాస్సేపాగి చూసి వెళ్దామా?" సంబరంగా అన్నాడు అప్పారావు.
"జాతరేంకాదు! ... మనం ఎలాగూ ఇక్కడే ఆగాలి! ...వీళ్ళందరూ నీళ్ళ ట్యాంకరు కోసం ఎదురు చూస్తున్న జనం ..." సమాధానం చెప్పాడు

బసవరాజు.
ఆ సమాధానం విన్న అప్పారావు మొహం పాలిపోయింది. "పోనీ నేనిప్పుడు హోటల్లో దిగనా?" అన్నాడు.
"నీళ్ళు పట్టుకెళ్ళాక అలానే దిగుదువుగాని ... వట్టి చేతుల్తో వెళ్తే మా ఆవిడ ఊర్కోదు."
అప్పారావు నోసలు మీద కొట్టుకొని బిందె చెంగున పెట్టుకుని నిలబడ్డాడు. ఇంతలో నీళ్ళ ట్యాంకరు రానే వచ్చింది. దాన్ని అల్లంత దూరంలో చూడగానే తోపులాట మొదలయ్యింది.
"గుభీ ...గుభీ .... గుభీ ....." అని శబ్దాలు రాసాగినయ్!
"ఏంటా శబ్దాలు?" ఆశ్చర్యంగా అడిగాడు అప్పారావు.
"గుంపులో గుద్దుకుంటున్నారు!" చెప్పాడు బసవరాజు.
అప్పారావు గుండెలు గుభేల్ మన్నాయి.
"క్యూలో నిల్చోండి.... క్యూలో నిలిస్తేతప్ప నీళ్ళు ఇవ్వను!" అంటూ అరచాడు ట్యాంకరతను.
అంతే! ...క్యూలో ముందు నిల్చోడం కోసం మళ్ళీ దెబ్బలాట మొదలయ్యింది. నేను ముందొచ్చానంటే నేను ముందొచ్చాను అంటూ ఒకర్నొకరు తోసుకోసాగారు.
ఇంతలో ఒకాయన పచ్చిబూతులు మాట్లాడుతూ అక్కడికి వచ్చాడు. అతని బూతులు విని అందరూ సిగ్గుతో చచ్చిపోయి "ఛీ..ఛీ..పాడు" అంటూ అతనికి దారి ఇచ్చారు. అతను బిందెతో నీళ్ళు పట్టుకుని వెళ్ళిపోయాడు.
"ఎవరాయన - అంత ఘోరమైన బూతులు మాట్లాడుతున్నాడు?" అంటూ అడిగాడు అప్పారావు బసవరాజుని.
"ఆయన ఈ కాలనీవాడేలే.... రాజకీయాల్లో తిరుగుతుంటాడు ... అందుకే బూతులు మాట్లాడ్డం బాగా అలవాటై పోయింది ..." చెప్పాడు బసవరాజు.
ఆ రాజకీయాలాయన వెళ్ళిపోయాక క్యూలో ముందు నిల్చోవడానికి మళ్ళీ తోపులాట మొదలైంది. అప్పారావు, బసవరాజు కూడా గుంపులోపడి జనాన్ని తోయడం మొదలుపెట్టారు.
"ఆడాళ్ళ మధ్య బిందెలు పట్టుకుని ఆడంగుల్లా వస్తారేం? కాస్త దూరంగా జరగండి" అంటూ ఒకావిడ వీళ్ళిద్దర్నీ తిట్టింది. అప్పారావు ఆవిడ మాటలు విని బాధపడ్డాడు.

"నాకేం బాధలేదు ... నాకిది అలవాటేగా... హిహి" అన్నాడు బసవరాజు. ఇంతలో ముందు నిల్చోడం గురించి ఇద్దరాడవాళ్లకి దెబ్బలాట జరిగింది. ఇద్దరూ బూతులు తిట్టుకోడం మొదలుపెట్టారు. ఈ వింతని పక్కగా నిల్చుని ఒక ముసలి బిచ్చగాడు చూడసాగాడు.

"అదిగో ... చూడవే ...నువ్వు ఆ ముసలి బిచ్చగాడితో పడుకుంటావే ...దొంగ... " అంది మొదట ఆవిడ.

"నువ్వే వాడి పక్కన పడుకుంటావే ..నీ...నీ..."

"నువ్వేనే..."

"నువ్వేనే..."

అలా వాళ్ళిద్దరూ హోరాహోరి దెబ్బలాడుకుంటున్నారు. ఆ ముసలి బిచ్చగాడికి సహనం చచ్చిపోయింది.

"ఇంతకీ మీ ఇద్దరిలో ఎవరు నాదగ్గర పడుకుంటారో త్వరగా తేల్చి చెప్పండి ... అవతల నాకు అడుక్కోవటానికి టైమైపోతుంది" అంటూ అసహనంగా అరిచాడు.

ఆ మాటలు విని అందరు ఆడవాళ్ళు ఆ ముసలాడిని తరిమి కొట్టారు. తరువాత మళ్ళీ నీళ్ల ముందు పట్టుకోడం గురించి తోపులాట మొదలైంది. అక్కడ చొక్కాలు చిరిగిపోతున్నాయ్... చీరలు ఊడిపోతున్నాయ్ ... క్రాపులు రేగిపోతున్నాయ్ ... కొప్పులు ఎగిరి పోతున్నాయ్!

ఆ టైంలో ఇద్దరు పోలీసులు వచ్చి, లాఠీలు అదిలిస్తూ అందర్నీ క్యూలో నిల్చోబెట్టారు.

ఇద్దరికి రెండు బిందెల నీళ్ళు ఇచ్చాక ట్యాంకర్‌లో నీళ్ల అయిపోయాయ్.

"ఏంటయ్యా ఇది? ... ట్యాంకర్లో తెచ్చేది రెండుమూడు బిందెల నీళ్ళేనా?" అంటూ అరిచారు జనం.

"చాల్లేవయ్యా! ... మేమంత తెలివి తక్కువ దద్దమ్మలం అనుకున్నావా ఏంటి? ... ట్యాంకర్ నిండానే నీళ్ళు తెచ్చాం ... కానీ అంత దూరం నుండి రోడ్డు పొడుగునా నీళ్ళు ధారగా కార్చుకుంటూ వచ్చాం కదా? ... అందుకే మూడు బిందెల నీళ్ళే మిగిలాయ్! ..." అన్నారు నీళ్ళ ట్యాంకర్‌తో వచ్చిన మనుషులు.

అది విని అందరూ తెల్లబోయారు.

ఆ రాత్రికి బసవరాజుకి, అప్పారావుకి ఇంట్లో భోజనం లేదన్న సంగతి వేరేగా చెప్పనక్కర్లేదని అనుకుంటా.

* * *